ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 4 ఆగస్టు 2025



బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం: స్పీకర్



విగ్రహావిష్కరణకు ర్యాలీగా వస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం మర్పల్లి మండలంలోని పట్లూర్ గ్రామంలో నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజన, బహుజనుల అభివృద్ధే ప్రజాప్రభుత్వ ధ్యేయమన్నారు. అంబేడ్కర్ అందరివాడని, దేశంలోని కోట్లాది మంది దళిత, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజలు తలెత్తుకొని జీవిస్తున్నారంటే ఆయన రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ ఏడాది రూ.40,232 కోట్లు కేటాయించిందన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, కొండల్ యాదవ్, సురేశ్, కృష్ణారెడ్డి, రామేశ్వర్, రాములుయాదవ్, సురేశ్, స్వప్న పాల్గొన్నారు.





పర్యాటకుల సందడి

కోలాహలంగా అనంతగిరి

స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం అనంతగిరికి పర్యాటకులు పోటెత్తారు. అనంతగిరిలోని వ్యూ పాయింట్ వద్ద స్నేహితులతో కలిసి ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ముందుగా అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుని ఆపై అనంతగిరి అడవిలో పర్యటిస్తూ అక్కడి అందాలను ఆస్వాదించారు.

-వికారాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి)



భూ పత్రాలను చూపుతున్న నాయకులు

13.21 ఎకరాల ఆలయ భూములు కబ్జా

పూడూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్‌గోముల్ గ్రామ పరిధిలో ఉన్న పరిగి గోపాలస్వామి ఆలయ భూములు కబ్జాకు గురైనట్లు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజు ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పరిగిలోని గోపాలస్వామి ఆలయానికి సర్వే నంబర్-48లోని 13.21ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమిని చెన్‌గోముల్‌కు చెందిన కరీంముల్లాఖాన్ 1969లో ఆలయం వారు సాగు చేసేందుకు ఇచ్చారు. కాగా, కుత్రపన్ని 1996లో ఆ భూమిని అక్రమ పట్టా చేసుకున్నాడు. అలాగే 2002-03 సంవత్సరంలో హైదరాబాద్‌కు చెందిన మాణిక్‌రెడ్డి కూతురు అంజమ్మకు 3.20 ఎకరాలు, కుమారులు సురేందర్‌రెడ్డికి 3.20 ఎకరాలు, నరేందర్ రెడ్డికి 6.21ఎకరాల చొప్పున ఆ భూమిని విక్రయించాడు. ఆ భూమి విషయంలో కొందరు కోర్టును ఆశ్రయించగా, 48/1, 48/2, 48/3 సర్వే నంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ అయినట్లు 2019 మార్చి 30న కోర్టు తెలిపింది. ఇదిలా ఉండగా, ఈ ముగ్గురు కూడా ఆ భూమిని హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఆసీఫ్ అనే వ్యక్తికి విక్రయించారంటూ ఆ భూమిలో బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో ఆ బోర్డును గ్రామస్తులు తొలగించారు. ఇదే కాకుండా చెన్‌గోముల్‌లోని వరకుమారస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్-464లోని 4.20ఎకరాల భూమిని కూడా కబ్జా చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎండోమెంట్ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో మల్లేశ్ ఉన్నారు.


ఓటరు జాబితా రెడీ

వార్డుల వారీగా ఓటరు లిస్ట్ విభజన



స్థానిక సంస్థల ఎన్నికలకు చకచకా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఇప్పటికే పంచాయతీల వారీగా కొత్త ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాయి. పంచాయతీ కార్యదర్శులు గ్రామం యూనిట్‌గా తీసుకుని వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారు చేశారు. గత జనవరిలో ప్రకటించిన ఓటరు లిస్ట్ ఆధారంగా వార్డుల వారీగా విభజించారు. ఒక కుటుంబ సభ్యులు అందరూ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే టీపోల్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.


- గ్రామం యూనిట్‌గా లిస్ట్ సిద్ధం చేసిన పంచాయతీ కార్యదర్శులు
- ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో..
- గత జనవరి లిస్ట్ ఆధారంగా మార్పులు
- స్థానిక సంస్థల ఎన్నికలకు చకచకా ఏర్పాట్లు
- జిల్లాలో 594 పంచాయతీలు, 5,058 వార్డులు
- మొత్తం పోలింగ్ కేంద్రాలు 5,058



వికారాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇప్పటి వరకు మండలం యూనిట్‌గా అన్ని గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను ఎంపీడీవో లాగిన్‌తో టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేయగా, ప్రస్తుతం గ్రామం యూనిట్‌గా కొత్త జాబితాను సిద్ధం చేశారు. ఈ కొత్తగా రూపొందించే జాబితాను పంచాయతీ కార్యదర్శులు తమ లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయనున్నారు. ఎన్నికల్లోగా కొత్త ఓటర్లు నమోదైతే అనుబంధ జాబితాలో నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఎన్నికల సంఘానికి పంపించనున్నారు.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం

జిల్లాలో 20 మండలాల పరిధిలో 594 గ్రామ పంచాయతీలు ఉండగా, 5,058 వార్డులు ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల పోలింగ్ కోసం ఇప్పటి వరకు 3,250 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. మహారాష్ట్ర నుంచి ఇంతకు ముందు వచ్చిన బ్యాలెట్ బాక్సులు 1,250 ఉండగా, కర్ణాటకలోని బీదర్ నుంచి 2



వేల బ్యాలెట్ బాక్సులు ఇది వరకే జిల్లాకు వచ్చాయి. కాగా, ఎన్నికలు ఎన్ని విడతల్లో నిర్వహిస్తారనేది స్పష్టత వస్తే.. జిల్లాకు వచ్చి బ్యాలెట్ బాక్సులు పరిపోతాయా? లేక ఇంకా ఎన్ని అదనంగా

మిగతా 8వ పేజీలో...

సిబ్బంది వివరాల సేకరణ

పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే సిబ్బందిని సమకూర్చునే ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు(ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్వోలు), ప్రిసైడింగ్ అధికారుల (పీవోలు), సహాయ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీవో), పోలింగ్ సిబ్బంది అవసరమనేది గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కొందరు ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లగా, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి కొందరు వచ్చారు. వారిలో ఆర్వోలు, ఏఆర్వోలు, పోలింగ్ సిబ్బంది ఎవరెవరనేది గుర్తించి టీపోల్‌లో నమోదు చేస్తున్నారు. ఏ ఎన్నికలు ఎన్ని విడతల్లో నిర్వహిస్తారనేది స్పష్టత వస్తే ఆ ఎన్నికలకు అనుగుణంగా బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది విభజన చేసే విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకునే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.



మాట్లాడుతున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

దళితులకు న్యాయం చేయాలి

కొడంగల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నిర్వీర్యం చేయకుండా న్యాయం చేయాలన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని పర్సాపూర్, రేగడిమైలారం తదితర గ్రామాల్లో దళితులకు జరిగిన అన్యాయంపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. బిచ్చాల్‌లో పోలీసులు బాధితులకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. కుల వివక్ష, అంటరాని తనం, అగ్ర కులస్థులపై నమోదైన అట్రాసిటీ కేసులను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంబేడ్కర్ ప్రజా సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, సాయిలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివకుమార్, ప్రజా సంఘాల నాయకులు దశరథ్, సాయిలు, పకీరప్ప, ఆనంద్, శేఖర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో జోనల్ స్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక



పరిగి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని మినీ స్టేడియంలో ఈనెల 5, 6 తేదీల్లో జోనల్‌స్థాయి క్రికెట్ క్రీడాకారుల సెలక్షన్స్ ఉంటాయని పరిగి జోనల్ కార్యదర్శి ఎండీ ఖాజా తెలిపారు. 5న అండర్-17 బాలురు, 6న అండర్-17 బాలికలు, అండర్-14 బాలుర ఎంపికలు ఉంటాయని తెలిపారు. అండర్-17 బాలుర, బాలికలు 01.01.2009 తర్వాత, అండర్-14 01.01.2012 తర్వాత జన్మించి ఉండాలని సూచించారు. ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. సెలక్షన్‌కు వచ్చేటప్పుడు ఇంటర్ ఫస్టియర్ వారు టెన్త్ మెమో, మిగతా వారు బోనోఫైడ్, ఆధార్ కార్డులు తప్పకుండా తీసుకురావాలని సూచించారు.

బల్దియాలో ఇష్టారాజ్యం!

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

- కమిషనర్ కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై మాజీ కౌన్సిలర్ రిట్
- తాండూరు బల్దియా అధికారులపై పోలీసులకు ఫిర్యాదు
- వివాదాలకు దారి తీస్తున్న మురుగు కాల్వ నిర్మాణం



ప్రైవేటు ప్లాట్ నుంచి తవ్విన మురుగు కాల్వ

తాండూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చిలుక వాగు ద్వారా వచ్చే వర్షపు నీరు, మురుగు నీరును దారి మళ్లించేందుకు మెలికలు తిరుగుతూ కాల్వను నిర్మిస్తుండటం వివాదంగా మారుతోంది. స్పష్టమైన మ్యాప్ లేకుండా బల్దియా అధికారులు, ఇరిగేషన్ అధికారులు కాల్వను నిర్మిస్తుండటం ఈ వివాదానికి కారణమవుతోంది. కాగా, సొంత స్థలానికి కూడా బల్దియా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని రిటైర్డ్ లెక్చరర్ రంగారావు, విజయాదేవి దంపతులు వాపోతున్నారు. కోర్టుకు వెళ్తే కూడా అధికారులు ధిక్కరిస్తూ అన్యాయం చేస్తున్నారని ఆ కుటుంబం వాపోతుంది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడికి ఈ స్థలం విషయంలో అధికారులు చుక్కలు చూపించడాన్ని పలువురు ఉద్యమ నేతలు తప్పు పడుతున్నారు.

హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు

వర్షకాలంలో వరద సాయిపూర్, హైదరాబాద్ రోడ్డు మార్గంలో ప్రవహించి చిలుక వాగులో కలుస్తుంది. చిలుక వాగు ప్రక్షాళన చేసి నీరు సాఫీగా వెళ్లేందుకు బల్దియా అధికారులు, టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు

మిగతా 8వ పేజీలో...

పోలీసులకు ఫిర్యాదు

చివరకు శనివారం అర్ధరాత్రి హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ బల్దియా అధికారులు కాల్వను తవ్వించారు. ఆ సమయంలో విజయాదేవి 100 డయల్ చేసి పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సైతం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నం. 95, 96/యూ, 69/యూయూ, 97/ఏ , 106ఎల్‌యూ, 107/యూఆర్‌లోని స్థల వివాదంపై హైకోర్టు తాత్కాలిక ఆర్డర్‌ను జారీ చేస్తూ కమిషనర్ జోక్యం చేసుకోవద్దని పేర్కొంది. అయినా మున్సిపల్ సిబ్బంది తన ప్లాట్‌ను డ్యామేజ్ చేశారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కోర్టు ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. ఇదిలా ఉంటే మున్సిపల్ కమిషనర్ వారి కాలేజ్ భవనం అక్రమంగా నిర్మించారని నోటీసులు జారీ చేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. కాలేజీకి నోటీసులు అంటిస్తామని టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది హెచ్చరించినట్లు సమాచారం.

నేడు తాండూరులో మెగా వైద్య శిబిరం

తాండూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో ఇంద్రానగర్‌లోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో నేడు(సోమవారం) 'మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందన్నారు. చెవి, ముక్కు, గొంతు, నేత్రాలు(కళ్లు) ఆపరేషన్ అయిన వాళ్లకు సమస్యలుంటే, వరబీజం, పైల్స్ కడుపులో గడ్డలు వంటి వ్యాధులకు చికిత్స అందించేందుకు స్పెషల్ డాక్టర్లు వస్తారని చెప్పారు. ఈ శిబిరానికి డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్ యాదవ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరిధర్ హాజరుకానున్నట్లు తెలిపారు.



ఈ అవస్థలెన్నాళ్లు?

- ఇళ్లలోకి చేరుతున్న వాగు నీరు
- ఇందూరులో ఇబ్బందులు పడుతున్న జనం
- మరో కల్వర్టు నిర్మాణమే సమస్యకు పరిష్కారం

7

కమీషన్.. పరేషాన్!

- ఆశగా ఎదురుచూస్తున్న రేషన్ డీలర్లు
- దుకాణాల అద్దెలు సైతం చెల్లించలేక నానా అవస్థలు
- మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 618 రేషన్ దుకాణాలు

మేడ్చల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ఆదేశాల మేరకు డీలర్లు మూడు నెలల(జూన్, జూలై, ఆగస్టు) రేషన్ బియ్యాన్ని అష్టకష్టాలు పడి లబ్ధిదారులకు అందజేశారు. అయినా ఐదు నెలలుగా వారికి అందాల్సిన కమీషన్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల బియ్యం పంపిణీ చేసి, రెండు నెలలుగా ఎటువంటి పనిలేక, కమీషన్ సొమ్ము కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 618 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఐదు నెలలుగా కమీషన్ డబ్బులు పెండింగ్‌లో ఉండటంతో డీలర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల పంపిణీ చేసిన మూడు నెలలతో పాటు అంతకు ముందు ఏప్రిల్, మే నెలల కమీషన్ కూడా ఇంత వరకు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రేషన్ దుకాణాల అద్దెలు

మిగతా 8వ పేజీలో...

ఐదు నెలలుగా అందని సొమ్ము



వేర్వేరుగా కమీషన్ చెల్లింపులు

ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే కమీషన్ ఒకేసారి డీలర్లకు అందేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వేరుగా, రాష్ట్ర ప్రభుత్వం వేరుగా కమీషన్ అందించనున్నట్లు తెలిసింది. దీంతో సాఫ్ట్‌వేర్‌లో పలు మార్పులు చేయాల్సి ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కమీషన్ పెరగడంతో పాటు కష్టాలు తీరుతాయని ఆశ పడిన రేషన్‌డీలర్లకు నిరాశనే ఎదురవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే కమీషన్ డబ్బులు విడుదల చేయాలని డీలర్లు కోరుతున్నారు.

తెలంగాణ ఉత్తమ ఎంపీపీగా బాలేశ్వర్‌గుప్తా



యాలాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా తెలంగాణ ఉత్తమ ఎంపీపీ అవార్డును అందుకున్నారు. ఆదివారం లలిత కళా సమైక్య సాంస్కృతిక సేవా సంస్థ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 9రాష్ట్రాలకు చెందిన అన్ని రకాల కళాకారులకు అవార్డులు అందజేశారు. కాగా, యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాను ఉత్తమ ఎంపీపీగా ఎంపిక చేశారు. ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సినీ ప్రముఖులు శివాజీ రాజా, జనార్దన్‌రావు, ధారా లక్ష్మణ్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించి అవార్డులు అందజేశారు. బాలేశ్వర్ గుప్తాకు షీల్డుతోపాటు సువర్ణ కంకణం, గోల్డ్ మెడల్, శాలు, పోల కిరీటంతో ఘనంగా సత్కరించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ఆర్వో అర్షద్‌ను శాలువాతో సన్మానిస్తున్న కమిషనర్ జ్యోతి

శామీర్‌పేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విధుల్లో అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని తూంకుంటమున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. మునిసిపాలిటీ ఆర్వో అర్షద్ అహ్మద్ జల్‌పల్లి మున్సిపాలి టీకి బదిలీ అయ్యారు. ఆదివారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు సన్మానాన్ని నిర్వహించారు. అర్షద్ అహ్మద్‌ను కమిషనర్, మేనేజర్ శ్రావన్‌కుమార్, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమని, నిజాయితీగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తే మనం ఎక్కడున్నా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. తూంకుంటలోని డబుల్ బెడ్ రూమ్‌లకు ఇంటి నంబర్లను కేటాయించడంతో అర్షద్ అహ్మద్ ముఖ్య పాత్ర పోషించారని, తక్కువ సమయంలో ఎక్కువ ఇంటి నంబర్లను కేటాయించిన ఘనత తూంకుంట మున్సిపాలిటీకే దక్కిందన్నారు. అనంతరం ఆర్వో అర్షద్ అహ్మద్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో విధులు నిర్వహించిన సమయంలో సహకరించిన అధికారులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లకుధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జికి పడిన రంధ్రం పూడ్చివేత



కాగ్నా నది బ్రిడ్జిపై మరమ్మతులు చేసి సీసీతో పూడ్చిన రంధ్రం

తాండూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ రోడ్డు మార్గం కాగ్నా నది బ్రిడ్జిపై పడిన భారీ రంధ్రాన్ని ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చివేశారు. జులై 27న పెద్ద రంధ్రం పడి రాజకీయ రాద్ధాంతం జరిగిన విషయం తెలిసిందే. పూర్తయిన పనులతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. తాండూరు నుంచి కొడంగల్, మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట్, కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్, యాద్గిర్, కృష్ణా ప్రాంతాల వాసులు ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ బ్రిడ్జి నాణ్యతపై మరోసారి పూర్తి స్థాయిలో ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలన జరపాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించని అంశంలో బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు.

పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

మొయినాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి కుటుంబీకులు పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇల్లును దోచేశారు.ఈ ఘటన మొయినాబాద్ మున్సిపల్ పరిధి పెద్దమంగళారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సీహెచ్.అనిత, కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో బంధువుల పెళ్లికి వెళ్లారు. ఆదివారం ఇంటికొచ్చారు. కాగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులు చిందరవందర చేశారు. దొంగలు బీరువా తాళం పగులగొట్టి అందులో దాచిన రెండు బంగారు నెక్లెస్‌లు, రెండు జతల కమ్మలు, రెండు బ్రాస్‌లైట్లు, నాలుగు గాజులు మొత్తం సుమారు 16తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయారని బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముదిరాజ్ గ్రామ కమిటీల ఎన్నిక



లేమూరు ముదిరాజ్ కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న పాండు

కందుకూరు, ఆగష్టు 3(ఆంధ్రజ్యోతి): లేమూరు, అగర్‌మియాగూడ, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లి, ఉట్లపల్లి, కటికపల్లి గ్రామాల ముదిరాజ్ కమిటీలను ఎన్నుకున్నట్లు సంఘం మండలాధ్యక్షుడు పిట్టల పాండు ఆదివారం తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల అనంతరం మాట్లాడారు. లేమూరు గ్రామ అధ్యక్షుడిగా డిల్లీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ ఎన్నుకున్నట్లు తెలిపారు.అగర్‌మియాగూడ అధ్యక్షుడిగా నీరటి పాండు, ఉపాధ్యక్షులుగా గిరి, సాయిరెడ్డిగూడ అధ్యక్షుడు గొరైంకల నర్సింహ, ఉపాధ్యక్షుడు ఎం.పాండు, దాసర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మీగడ శేఖర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఉట్లపల్లి గ్రామ అధ్యక్షుడు కె.సత్తయ్య, కటికపల్లి అధ్యక్షుడిగా నూకం సురేందర్, యూత్ అధ్యక్షుడిగా ఎ.రమేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎడ్ల బాబురావు, జయేందర్, బి.అంజయ్య, పి.లింగం, శ్రీధర్, మధు, వి.సుదర్శన్, వెంకటేష్, సత్యం, మహేందర్, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని రాగి జావ

» పాఠశాలలు ప్రారంభమై నెలలైనా అమలు చేయని ప్రభుత్వం

» అర్ధాకలితో విద్యార్థుల బాధలు

కులకచర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేయడం లేదు. ఉదయం పూట విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడకూడదని స్కూళ్లలో వారంలో మూడు రోజులు రాగి జావ పంపిణీకి గతంలో ప్రభుత్వం నిర్ణయించి రెండేళ్లపాటు అందజేసింది. విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతో స్కూళ్లలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమైనా ఇప్పటి వరకు విద్యార్థులకు రాగి జావ ఇవ్వడం లేదు. దీని అమలుపై జిల్లా, మండల స్థాయి అధికారులకు పాఠశాల విద్యాశాఖ ఇంకా ఆదేశాలు జారీ చేయలేదు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

మధ్యాహ్న భోజనం వరకు ఆకలితోనే..

ఉదయం పూట పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో వస్తారని, అలాగే తల్లిదండ్రులకు ఉదయం టిఫిన్‌చేసే ఇబ్బందులు తప్పించాలని ప్రభుత్వం ఉదయం పాఠశాలల్లో రాగి జావ అందజేసే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఒక్కో విద్యార్థికి గ్లాసెడు రాగి జావ అందజేసేందుకు రూ.3 చొప్పున నిర్వాహకులకు చెల్లించింది. ఉదయం రాగి జావ తాగితే విద్యార్థులకు బ్రేక్‌ఫాస్టులా పనిచేసేది. బెల్లంతో కలిపి ఇచ్చే రాగి జావతో బాలికల్లో రక్తహీనత నివారణకు ఉపయోగపడేది. ఇప్పుడు జావ ఇవ్వక ఉదయం ఇంటి వద్ద తిన కుండా వచ్చే విద్యార్థులు



విద్యార్థులకు రాగి జావ పంపిణీ(ఫైల్)



మధ్యాహ్న భోజనం వరకు ఆకలితో అలమటిస్తున్నారు. నిబంధనల మేరకు ఓ సంస్థ వారు 2023-2024 నుంచి పాఠశాలలకు బెల్లం కలిపిన రాగిజావ పొడిని సరఫరా చేసేవారు. దానిని వేడి నీటిలో కలిపి విద్యార్థులకిచ్చేవారు. ఇలా 2024-2025 విద్యా సంవత్సరం చివరి వరకు అందజేశారు. ఈ సారి ఇంకా జావ పంపిణీ ప్రారంభించలేదు. పాఠశాలల్లో రాగి జావ పొడి అయిపోయిందని ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే తెలియజేశారు. అయితే మళ్లా ఆర్డర్ చేసి తెప్పించేందుకు పాఠశాల విద్యాశాఖ నుంచి ఆదేశాలు రాలేదని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పాఠశాలల్లో వెంటనే రాగి జావ పంపిణీని ప్రారంభించేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న 1,029 ప్రభుత్వ పాఠశాలల్లో 75,952 మంది వరకు విద్యార్థులున్నారు.

రాగి జావ ఆరోగ్యానికి ఎంతో మేలు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్యపరంగా రాగి జావ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఉదయం విద్యార్థులకు పౌష్టికత్వంతో కూడిన రాగి జావ అందించగా విద్యార్థులంతా ఉత్సాహంగా తాగేవారు. అలాగే ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు కూడా రాగి జావ పంపిణీ దోహదం చేసింది. వెంటనే స్కూళ్లలో రాగి జావ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- రాఘవేందర్‌రెడ్డి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు, కులకచర్ల



పెట్రోల్ పంపును ప్రారంభించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎనుముల కొండల్‌రెడ్డి

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

శంకర్‌పల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి పథకాలను ఎంచుకోవడం శుభపరిణామమని, వాటితో ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి పట్టణ పరిధి హెచ్‌పీ పెట్రోల్ పంపును ఆదివారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ఇవ్వడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కె.చంద్రమోహన్, నాయకులు దేవ్లానాయక్, ప్రకాశ్, చంద్రమౌళి, వెంకట్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మైపాల్, రఘునందన్‌రెడ్డి, కాంతిరెడ్డి, సతీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రశాంత్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహేశ్వరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి జాతీయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్ అన్నారు. ఈ నెల 10న సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిరవహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆదివారం మహేశ్వరంలో సంఘం మండల అధ్యక్షుడు నిమ్మగూడెం సుధీర్ గౌడ్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామారావుగౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతానికి రాజకీయాలతో సంబంధం లేకుండా గౌడ సంఘం నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సురేశ్‌గౌడ్, రాజేష్‌గౌడ్, మశ్చేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాపిరాజ్‌గౌడ్, వరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సూర్యగిరి ఎల్లమ్మ బోనాలకు తరలిరావాలి

మహేశ్వరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):తుక్కుగూడ మునిసిపాలిటీలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా భక్తులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. 11, 12 తేదీల్లో జరిగే ఎల్లమ్మ బోనాల వాల్ పోస్టర్‌ను ఆదివారం జిల్లెలగూడలోని తన క్యాంప్ కార్యాలయంలో సబితారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రత్నం తదితరులు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ఎల్లమ్మ ఆలయానికి ఘన చరిత్ర ఉందని, ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను రాజకీయాలతో సంబంధం లేకుండా అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. ఆలయానికొచ్చే భక్తులకు కావాల్సిన సదుపాయాలను కల్పించేలా ఆలయ కమిటీ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్య, సుమన్, సురేశ్, నాగేష్‌గౌడ్, బుచ్చిరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. ఎండుతున్న పైర్లు

» వారం రోజులుగా పని చేయని ట్రాన్స్‌ఫార్మర్

» వరి నారు, దుక్కులకు అందని నీరు

షాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండుతున్నాయని కేశవగూడ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పాడైందని వారం రోజుల కింద అధికారులకు తెలిపినా బాగు చేయించడంలేదన్నారు. పదెకరాల్లో వరి నారుకు, దుక్కికి నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏతకొచ్చిన వరి నారు, అలాగే నాటేసేందుకు దున్నిన దుక్కి కూడా ఎండుతోందని రైతులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరిస్తానన్న డీఈఈ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయడమో లేదా పాతదే బాగుచేయించడమో చేయాలని కేశవగూడ రైతులు కోరుతున్నారు.



ఎండుతున్న వరి నారును చూపుతున్న రైతు

ఈ అవస్థలెన్నాళ్లు?

» ఇళ్లలోకి చేరుతున్న వాగు నీరు

» ఇందూరులో ఏళ్లుగా ఎస్సీ కాలనీ వాసుల ఇబ్బందులు

» మరో కల్వర్టు నిర్మాణమే సమస్యకు పరిష్కారం



ఇళ్ల పక్కనుంచి పారుతున్న వాగు



ఎస్సీ కాలనీలో ఇంట్లోకి చేరిన నీరు(ఫైల్)

పెద్దేముల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆ కాలనీ వాసులను వర్షాకాలం కష్టాలు చుట్టుముడుతున్నాయి. కాస్త పెద్దవాన కురిస్తే సమీప వాగు పొంగి నీరు ఇళ్లలోకి వస్తోంది. వర్షం పడిన సమయాల్లో రాత్రిళ్లు వారికి నిద్ర కరువవుతోంది. వంట సామగ్రి తడవకుండా ఉండేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పక్కనున్న వాగుతో తాము ఈ అవస్థలు ఎన్నాళ్లు భరించాలని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దేముల్ మండలం ఇందూరులో ఊరి చివర వాగు పారుతోంది. దానిలో వరద సాఫీగా వెళ్లే వీలులేక నీరు వెనక్కి తన్ని పక్కనున్న ఇళ్లను ముంచెత్తుతోంది. గ్రామస్తులు సమస్యపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకోగా చిన్నపాటి కల్వర్టును నిర్మించారు. అయితే అధికారులు ఇక్కడే తప్పు చేశారు. కాలువపై ఎత్తు పెంచి ఒక్క కల్వర్టే నిర్మించారు. మరో కల్వర్టును నిర్మించి ఉంటే నీరు సాఫీగా వెళ్లేది. ఇప్పుడు వరద ఇళ్లలోకి చేరి వస్తువులన్నీ తడిసిపోతున్నాయి. ప్రస్తుత కల్వర్టు పక్కన మరో కల్వర్టు కట్టాలని గ్రామస్తులు కోరుతున్నా, ఆందోళనలు చేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జూలై 22 అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఇందూరు వాగులో వరదనీరు ప్రవహించి సమీప ఇళ్లలోకి నీరు చేరింది. ప్రజలు ఆందోళనకు గురయ్యారు. వెంటనే వంటసామగ్రి, బియ్యం ఇతర వస్తువులను మంచాలు, అటకల మీదికి ఎక్కించారు. అయినా కొందరి ఇళ్లలో వస్తువులు తడిసిపోయాయి.

ఒకే కల్వర్టుతో నీరు సాఫీగా వెళ్లడం లేదు



వర్షాకాలంలో మేము నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. వాగుపై ఒకే కల్వర్టు నిర్మించడంతో వరదనీరు సాఫీగా వెల్లడం లేదు. భారీ వర్షాలొస్తే వరద పెరిగి మా ఇండ్లలోకి నీరొస్తోంది. కొన్నిసార్లు పాములు కూడా వస్తున్నాయి. దీంతో మేం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. పాలకులు అదనపు కల్వర్టు నిర్మిస్తేనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

- కందనెల్లి మొగులప్ప, ఇందూరు

తిండి గింజలు నీటి పాలవుతున్నాయి



కూలి చేసి సంపాదించుకున్న తిండి గింజలు వరదపాలవుతున్నాయి. పెద్ద వర్షం వస్తే మాకు నిద్ర ఉండదు. వంట సామాగ్రంతా మంచాలపై, అటకపై పెడుతున్నాం. వరదలో పాములు కూడా కొట్టుకొస్తున్నాయి. చీకట్లో ఏ పాము కరుస్తుందోనని జంకుతున్నాం. అధికారులు, పాలకులు వరదనీరు ఇండ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

- కుంటల లింగప్ప, ఇందూరు

ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు అనుమతులు కావాలా?

» ప్రభుత్వం ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి

» వీహెచ్‌పీ సేవా ప్రముఖ్ బండారి రమేశ్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మనుషుల్లో దైవ భక్తి, దేశ భక్తి, సామాజిక బాధ్యత, ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తూ సన్మార్గంవైపు నడిపిస్తున్న ధార్మిక కార్యక్రమాలను ప్రపంచ దేశాలన్నీ ఆచరిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని విశ్వహిందూ పరిషత్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సేవా ప్రముఖ్ బండారి రమేశ్ ఆదివారం పేర్కొన్నారు. అర్చకులు, పండితులు, పురోహితులు దేశ విదేశాల్లో ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తుండడం వల్ల యువత ఆధ్యాత్మికత వైపు పయణిస్తోందని తెలిపారు. ధార్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ధార్మికతతో సంస్కృతీ సంప్రదాయాలు పరిరక్షించబడతాయని, యువత సన్మార్గంలో నడుస్తుందని తెలిపారు. అనుమతి లేకుండా ఆలయ పూజారులు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించొద్దంటూ ఎండోమెంట్ శాఖ ఉత్తర్వులు జారీచేయడం సరికాదన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై గణేష్ నవరాత్రులు, శ్రీరామ నవమి, బ్రహ్మోత్సవాలు, జాతరలు వంటి సామాజిక కార్యక్రమాలకూ అనుమతి తీసుకోవాలా? అని ఆ ప్రకటనలో రమేశ్ ప్రశ్నించారు. ఆలయ పూజారులను కట్టడిచేసే ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.



చౌదర్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

రాజ్యాధికారం కోసం బీసీలు ఉద్యమించాలి

యాచారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం కోసం బీసీలు ఉద్యమించాలని, రాజ్యాధికారం లేకపోవడంతో బీసీలు తరతరాలుగా అన్యాయాలకు గురవుతున్నారని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ప్రచారకార్యదర్శి కె.నరహరిచారి అన్నారు. ఆదివారం యాచారం మండలంలోని చౌదర్‌పల్లిలో ర్యాలీ నిర్వహించి అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లోనూ 42శాతం విధిగా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలు రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండి తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దసరా పండగ వరకల్లా రాష్ట్రంలో 200 మండలాల్లో కమిటీలు వేస్తామన్నారు. ఉద్యమంలో మహిళలకు కూడా కీలక బాధ్యతలు అప్పగించి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగార్జున, శ్రీనివాస్, శ్రీశైలం, బిక్షపతి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి

» జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి



పూజలో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తోందని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వ రంగంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందన్నారు. చందన్‌వెల్లిలోని పారిశ్రామికవాడలో నిలోఫర్ బాబూరావు ఏర్పాటు చేసిన నూతన నిలోఫర్ టీ పౌడర్ ప్యాకింగ్ ఫ్యాక్టరీని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్లతో కలిసి విజయలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు ఇలాంటి ప్రైవేట్ పరిశ్రమలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అన్ని ప్రోత్సాహకాలను కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్‌రెడ్డి, అశోక్, ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, లింగం, సుభాష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపుతో పింఛన్ల పంపిణీ

» తీరునున్న ఇక్కట్లు



పింఛన్‌దారుడి ఐరిస్ తీసుకుంటున్న పోస్ట్‌మ్యాన్

కులకచర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చేయూత, ఆసరా పింఛన్‌ల లబ్ధిదారులకు ముఖ గుర్తింపు విధానంతో డబ్బు అందిస్తున్నారు. ఇప్పటి వరకు వరకు వేలి ముద్రలు పడని వృద్ధులు, అందులకు, దివ్యాంగులకు పంచాయతీ కార్యదర్శి వేలిముద్రతో పోస్టుమెన్ పింఛన్‌లు ఇచ్చేవారు. ఈ విధానంతో అక్కడక్కడ లోపాలు జరుగుతున్నాయని ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్(ముఖ గుర్తింపు) విధానాన్ని అమలు చేస్తోంది. ఐరిస్ స్కాన్ చేసి పోస్టుమెన్ పింఛన్ ఇవ్వాలని, పింఛన్ల పంపిణీ ఇకపై పంచాయతీ కార్యదర్శులు చేయాల్సిన అవసరం లేకుండా నూతన విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సిస్టం ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చింది. పోస్టాఫీసుకు వెళ్లే పింఛన్‌దారులు యాప్ ద్వారా ముఖ గుర్తింపు నిర్ధారించుకొని పింఛన్ ఇస్తారు. ఫేస్‌స్కాన్‌తో బోగస్ లబ్ధిదారులకు సైతం చెక్‌పెట్టొచ్చని, అలాగే వేలి ముద్రల పడని వారి ఇబ్బందులు తీర్చేందుకని ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే పోస్టాఫీసుకు వెళ్లలేని వారికి గ్రామాల్లోనే ఫేషియల్ రికగ్నిషన్‌తో పెన్షన్ అందజేస్తారు. కాగా కులకచర్ల సబ్ పోస్టాఫీస్ పరిధిలో 7వేలకుపైగా సామాజిక పింఛన్‌దారులు ఉన్నారని ఎస్పీఎం రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వారికి ప్రతీ నెల 14 మంది పోస్టుమెన్ ద్వారా పింఛన్లను అందజేస్తామని ఆయన తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

చౌదరిగూడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌లో సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై రవీందర్‌నాయక్ అన్నారు. ఆదివారం శ్రీరంగాపూర్‌లో ఏర్పాటు చేసిన కెమెరాలను ఆయన పరిశీలించారు. గ్రామానికి చెందిన తెలంగాణ లారీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ సొంత డబ్బుతో గ్రామంలో సోలార్ విద్యుత్‌తో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గత పదేళ్లుగా గ్రామంలోని పలు సమస్యలు తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్న సయ్యద్ సాధిక్‌కు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్సై



బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

అమ్మవార్లకు ఘనంగా బోనాలు



ధర్మన్నగూడలో బోనాలతో మహిళలు

యాచారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మన్నగూడ, కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. బోనాల ఊరేగింపులో శివసత్తులు శిగమూగారు. ఆలయాల వద్ద మహిళలు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో సీఐ ఎ.నందీశ్వర్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

విఠాయిపల్లిలో బీరప్ప, మహంకాళి బోనాలు

ఆమనగల్లు: మున్సిపాలిటీలో పరిధి విఠాయిపల్లిలో బీరప్ప, మహంకాళి బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు ఆకట్టుకున్నాయి. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ సర్పంచ్ సాలయ్య, నాయకులు శంకర్, గణేశ్, వెంకటేశ్, నర్సింహ, మల్లయ్య, మహేశ్, ఆంజనేయులు, శ్రీశైలం, శివ, పాపయ్య, జంగమ్మ, మల్లయ్య పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఘట్‌కేసర్‌లో పండుగ సందడి

ఘట్‌కేసర్: బోనాల పండుగను ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఘట్‌కేసర్‌లో బోనాల పోచమ్మ, మహంకాళి, మైసమ్మ ఆలయాలను విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. రాత్రి ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వహించారు.



బోనంతో వెళ్తున్న ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.పావని



నారపల్లిలో కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

● కులకచర్ల ఎస్ఐ రమేశ్‌కుమార్



ఫటా ఫట్

కులకచర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల పీఎస్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ రమేశ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గ్రామానికో పోలీసు వ్యవస్థ కొనసాగిస్తూ ప్రజల సహకారం తీసుకుంటున్నామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి: కులకచర్లలో నేరాలు తగ్గాయా?

ఎస్ఐ: పీఎస్ పరిధిలో 45 పంచాయతీలు ఉన్నాయి. నేరాల సంఖ్య గతంతో పోల్చితే తగ్గింది. నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. చట్టపరంగా ముందుకెళ్తాం.

ఆంధ్రజ్యోతి: మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలేంటి?

ఎస్ఐ: ఇప్పటికే పోలీసు సిబ్బంది పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండేందుకు అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు భద్రతా చర్యలు తీసుకుంటున్నారా?

ఎస్ఐ: రోజూ వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నాం. నంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానా విధిస్తున్నాం. రోడ్డు భద్రతా నిబంధనలపై వారికి అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పండగల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలు?

ఎస్ఐ: గ్రామాల్లో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి ప్రశాంతంగా జరుపుకునేందుకు గ్రామస్థుల నుంచి సహకారం తీసుకుంటున్నాం. గ్రామానికి ఓ పోలీసు వ్యవస్థను కొనసాగిస్తున్నాం. అనుమతులు లేకుండా డీజేలు పెడితే సీజ్ చేస్తాం.

ఈ-పంచాయతీ సేవలకు సుస్తి!

● టీఫైబర్ కేబుళ్లు వేసి వదిలేసిన వైనం
● సరఫరా కాని కంప్యూటర్లు
● హామీలకే పరిమితమైన పాలకులు

దౌల్తాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు గత ప్రభుత్వం ఈ-పంచాయతీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ధృవీకరణ పత్రాలను ఎక్కడికక్కడే అందించడమే ముఖ్య ఉద్దేశంగా ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రారంభంలో కొన్ని గ్రామ పంచాయతీలకు ఆపరేటర్లను నియమించి కంప్యూటర్లను అందించింది. మిగతా వాటికి కంప్యూటర్లు, ఆపరేటర్లు లేకపోవడంతో సేవలు అందడం లేదు. నియమించిన వారికే క్లస్టర్లుగా విభజించి సేవలు అందిస్తున్నామని ప్రస్తుతం అధికారులు చెబుతున్నారు. దౌల్తాబాద్ మండలంలో మొత్తం 32గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

సమస్త సమాచారం పొందుపర్చేలా

ప్రతీ గ్రామ పంచాయతీకి అందించే ఈ-సేవలతో గ్రామాల్లో మెరుగైన పౌరసేవలు అందించేందుకు వీలవుతుందని ప్రభుత్వం భావించింది. నివేదికలు తయారు చేయడంతో పాటు జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వివాహాల నమోదు, జాబ్ కార్డుల జారీ, రేషన్ కార్డులు, పెన్షన్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ, వృత్తి, వ్యాపార లైసెన్స్‌ల మంజూర్ ఇలా ఎన్నో సేవలకు ఈ పంచాయతీల ద్వారా ప్రజలకు అందించాలి. దీనికి తోడు పన్నువసూళ్లు, పెన్షన్లు, వ్యక్తిగత సమాచారాలు, గ్రామ ప్రణాళికలు, అనుమతులు, గ్రామ సభల నిర్వహణ తదితర అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా పంచాయతీ నిర్వాహణ మొత్తం పారదర్శకంగా ఉంటుందని ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

పంచాయతీకో టీ-ఫైబర్

ఈ-పంచాయతీ పాలన అమలుకు గత ప్రభుత్వం ఇంటింటికి ఇంటర్‌నెట్ అందిస్తామని ప్రకటించి మిషన్ భగీరథ పైపులైన్‌తో టీ-ఫైబర్ లైన్ కోసం కేబుల్‌లను వేశారు. గ్రామ పంచాయతీ భవనాల్లో టీ-ఫైబర్ సర్వర్ బాక్సులను ఏర్పాటు చేశారు. కానీ అన్ని పంచాయతీలకు కంప్యూటర్‌లను మాత్రం సరఫరా చేయలేదు. కొన్ని పంచాయతీలకు సరఫరా చేసినా వాటిని కూడా మండల పరిషత్ కార్యాలయాలకు తరలించి అక్కడి నుంచే పని చేస్తున్నారు. చాలా చోట్ల వీరు గ్రామాల్లో కాకుండా ఎంపీడీవో కార్యాలయాల నుంచే పనిచేస్తున్నారు. గతంలో మండలానికో 2-3 క్లస్టర్‌లను ఏర్పాటు చేసి పెద్ద గ్రామ పంచాయతీల ద్వారా ఆపరేటర్లను కేటాయించిన పంచాయతీలకు వెళ్లేలా చేశారు. కానీ దానిని సైతం తొలగించి అన్ని మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాల నుంచే పనులు చక్కబెడుతున్నారు. దీంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చి పనులు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కంప్యూటర్‌లు సరఫరా చేసి ఆపరేటర్లను నియమిస్తే ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పలె దవాఖాన - దేవరఫస్లాబాద్ గ్రామ పంచాయతీ భవనంపై సోలార్ ప్లేట్లు

క్రైం కార్నర్

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం



తిరుపతి రైల్వేస్టేషన్‌లో బాలుడు ఈశ్వర్‌తో పోలీసులు

పూడూరు, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మన్నెగూడలోని పాఠశాల గోడదూకి వెళ్లిన బాలుడి ఆచూకీ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మక్తవెంకటాపురం గ్రామానికి చెందిన కె.ఈశ్వర్ మన్నెగూడలోని కేశవరెడ్డి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఈనెల 2వ తేదీన సాయంత్రం స్కూల్‌లో ఎవరికీ చెప్పకుండా గోడదూకి పారిపోయాడు. కుటుంబీకులు ఈశ్వర్ ఆచూకీ కోసం వెతికినా ఎక్కడా దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో కనిపించడంతో పోలీసులు గుర్తించి ఈశ్వర్‌ను పట్టుకున్నారు. అనంతరం బాలున్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే బాలుడు తిరుపతి వరకూ వెళ్లడానికి గల కారణాలు తెలియరాలేదు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బొంరాస్‌పేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్లకుంట గ్రామానికి చెందిన 20మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని ఆరోపించారు. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణ, కోట్ల యాదగిరి, శేరి నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, దేశ్యానాయక్, కోట్ల మహిపాల్, బండ శ్రీను, రవిగౌడ్, నెహ్రూనాయక్, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్.. పరేషాన్!

(ఐదో పేజీ తరువాయి)

చెల్లించలేక, హమాలీలకు డబ్బులు ఇవ్వలేక, బియ్యం సరఫరా లారీలకు కిరాయిలు చెల్లించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలువురు అప్పు చేసి అద్దెలు , హమాలీలకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. దీనికితోడు కుటుంబ పోషణ సైతం భారం అవుతోంది. పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక, కుటుంబాలు నడవక అందినకాడికి అప్పులు చేస్తున్నారు. క్వింటా బియ్యానికి రూ.140 చొప్పున కమీషన్ అందుతుంది.

దొడ్డు బియ్యం నిల్వలతో ఇబ్బందులు

రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలతో డీలర్లు ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రభుత్వం దొడ్డు బియ్యం బస్తాలను వెనక్కు తీసుకోకుంటామని చెప్పినా ఆ దిశగా చర్యలు లేకపోవడంతో దుకాణాల్లో స్థలం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెల ఉగాది నుంచి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఆ సమయంలో అప్పటికే దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యంను అధికారులు స్టాక్ రిజిస్టర్‌లో ఎంట్రీ చేసి సీజ్ చేశారు. అసలే ఇరుకైనా దుకాణాల్లో డీలర్లు దొడ్డు బియ్యం సంచుల నిల్వలతో నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో మరింత అవస్థలు తప్పడం లేదు. అలాగే ఎలుకలు, పురుగులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో దాదాపు 900 క్వింటాళ్ల దొడ్డు బియ్యం రేషన్ దుకాణాలల్లో నిల్వ ఉన్నట్లు సమాచారం.

ఏప్రిల్, మే కమిషన్ వచ్చింది

డీలర్లకు ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన కమీషన్ డబ్బులు విడుదల అయ్యాయి. మరో మూడు నెలలకు సంబంధించి హెడ్ ఆఫీస్‌లో అడగాల్సి ఉంది.

- శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నరాములు

కొడంగల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యమని బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నరాములు, రైతు మహాజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రామన్నగౌడ్ అన్నారు. కొడంగల్‌లో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి బీసీ సదస్సు నిర్వహించారు. బీసీలందరూ ఐక్యమత్యంగా ముందుకు వెళ్లాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలన్నారు. బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకుంటే తెలంగాణ ఉద్యమం తరహాలో మరో పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. 1931లో చేసిన కులగణనతో బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ పరంగా నష్టపోయారన్నారు. 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపితే కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఆమోదించలేదన్నారు. మండల్ కమిషన్ నుంచి రిజర్వేషన్‌ల అమలు వరకు బీసీలకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం తాలూకా అధ్యక్షుడు తలారి శేఖర్, నాయకులు మడిగే శ్రీను, రాములు, ఆశప్ప, సిద్దు, కిష్టప్ప యాదవ్, నర్సింహులు, వెంకట్, వెంకటయ్య, భీమారాజు పాల్గొన్నారు.

మిర్జాపూర్‌లో కొడిపీర్ల పండగ



కొడిపీర్ల ఊరేగింపు

పూడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్జాపూర్‌లో ఆదివారం కొడిపీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కుల మతాలకతీతంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో పీర్లను ఊరేగించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి శ్రీరామ్

కొడంగల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యువసేన ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరానికి హాజరైన మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ స్నేహితుల దినోత్సవం రోజున శుభాకాంక్షలు తెలుపుకోవడమే కాకుండా ప్రత్యేకతను చాటుకునే విధంగా గత పది సంవత్సరాలుగా రక్తదానంతో ఎంతో మందికి ప్రాణదాతలుగా నిలవడం అభినందనీయమన్నారు. యువసేన ఫ్రెండ్స్‌ను యువత ఆదర్శంగా తీసుకొని సమాజసేవకు పాటుపడాలన్నారు. అనంతరం టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్‌కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రవీందర్‌యాదవ్, సీఐ శ్రీధర్‌రెడ్డి, కొడంగల్ యువసేన ఫ్రెండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రెడీ

(ఐదో పేజీ తరువాయి)

అవసరమవుతాయనేది తెలియనుంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ప్రతీ వార్డులో కనీసం ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకున్నారు.

అనుబంధ జాబితాలో కొత్త ఓట్లు

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వెలువడినా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమైంది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల లెక్క తేల్చారు. గ్రామ పంచాయతీల్లో వార్డులను సైతం విభజించారు. ఇటీవల కొందరు కొత్త ఓటర్లు నమోదు కాగా, మార్పులు, చేర్పులు, తొలగింపు వంటివాటితో కొత్త ఓటరు జాబితా ప్రచురించారు. కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండే విధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఒకటో వార్డు నుంచి చివరి వార్డు వరకు ఓటర్ల జాబితాను సవరించనున్నారు. ఎన్నికల వరకు మళ్లీ నమోదు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులను ఆహ్వానిస్తే.. వారి వివరాలతో అనుబంధ జాబితాలు రూపొందించనున్నారు.

ఘనంగా గడీ మైసమ్మ తల్లి బోనాలు



మేడ్చల్ టౌన్: మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఉత్సవ నిర్వాహకులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణం తహసీల్దార్ కార్యాలయంలోని శ్రీ గడీమైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఆదివారం స్థానికులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు ఆలయానికి విచ్చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించటానికి గడీమైసమ్మ ఆలయ కమిటీ పెద్దఎత్తున ఏర్పాట్లు చేపట్టింది. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఆలయంలో ప్రవేశించి అమ్మవారిని దర్శించుకునే విధంగా ప్రత్యేకమైన ఏర్పాటు చేపట్టారు. మహిళలు బోనాలతో ఆలయానికి విచ్చేయగా యువజన సంఘాలు, యువకులు ఫలహారం బండ్ల ఊరేగింపుతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించుకున్నారు.

ఘట్‌కేసర్ రూరల్: మండలంలోని అంకుశాపూర్, ఘనాపూర్, వెంకటాపూర్, కాచవానిసింగారం గ్రామాల్లో బోనాల పండుగ అట్టహాసంగా జరుపుకున్నారు. గ్రామదేవతలైన మహంకాళమ్మ, నల్ల పోచమ్మ, పెద్దమ్మ, బంగారు మైసమ్మ ఆలయాలను సుందరంగా రంగురంగు దీపాలతో ముస్తాబు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. డప్పుచప్పుళ్ల శివసత్తుల విన్యాసాల మధ్య బోనాస్తుల విన్యాసాల మధ్య బోనాలు ముందుకు సాగాయి. వెంకటాపూర్‌లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి కల్యాణం

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఘనాపూర్‌లోని శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో ఆదివారం ఎల్లమ్మ తల్లి కల్యాణం ఒగ్గు కళాకారులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేముల మమతమహేష్‌గౌడ్, బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, నానావత్ సురేష్‌నాయక్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంకుశాపూర్‌లో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



ఎల్లమ్మతల్లి కల్యాణమహోత్సవంలో మాజీ సర్పంచ్ వేముల మమతమహేష్‌గౌడ్

కన్వెన్షన్ హాల్ ప్రారంభం



కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి , ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్‌లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం డీజీఆర్ కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, నాయకులు పన్నాల కొండల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌గౌడ్, బిక్షపతిగౌడ్, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, కవాడి మాదవరెడ్డి, సందీప్‌రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

బల్దియాలో ఇష్టారాజ్యం!

(ఐదో పేజీ తరువాయి)

కాల్వను నిర్మించేందుకు మ్యాప్ సిద్ధం చేశారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిడిలు ద్వారా మ్యాప్‌ను మార్చేశారు. 60 ఫీట్ల రోడ్డును సైతం కుదించారు. ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా మురుగు నీటి కాల్వను మున్సిపల్ మాజీ కౌన్సిలర్, అధికార కాంగ్రెస్ నాయకురాలు రిటైర్డ్ ప్రిన్సిపాల్ విజయా దేవికి చెందిన ప్లాట్ మధ్య నుంచి తవ్వేశారు. ఇదేమని ప్రశ్నిస్తే వారి గోడును వినే వారు లేరు. 3వేల గజాల ఇదే ప్లాట్‌పై సుమారు రూ.7లక్షల ఎల్ఆర్ఎస్ ఫీజులు సైతం మున్సిపాలిటీకి చెల్లించారు. అప్పుడు లేని మురుగు కాల్వ ఇప్పుడు ఎక్కడిదని వారు ప్రశ్నిస్తున్నారు. చివరకు విజయదేవి ఆమె భర్త రంగారావు హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి విచారణ జరిగే వరకు ఆ ప్లాట్‌పై ఎలాంటి చర్యలు చేపట్టొద్దని తాండూరు మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. అయినా మున్సిపల్ కమిషనర్ పోలీసుల జోక్యానికి ప్రయత్నం చేశారు. అంశం కోర్టులో ఉండటంతో పోలీసులు వెనుకడుగు వేశారు.

మొక్కలు నాటి రుణం తీర్చుకుందాం



బండమీదిపల్లి గ్రామంలో సీతారామస్వామి దేవాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న కూకట్‌పల్లి ఎస్ఐ మల్లేశం

పెద్దేముల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి జన్మనిచ్చిన గ్రామం రుణం తీర్చుకుందామని బండమీదిపల్లి గ్రామానికి చెందిన కూకట్‌పల్లి ఎస్ఐ.మల్లేశం పిలుపునిచ్చారు. మండలంలోని బండమీదిపల్లి గ్రామంలో జన్మించి ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారంతా కలిసి గ్రామంలో వన మహోత్సవం నిర్వహించి గ్రామపెద్దలతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా కూకట్‌పల్లి గ్రామంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మల్లేశం మాట్లాడుతూ పచ్చనిచెట్లు ప్రగతి మెట్లు అని, మొక్కలు నాటి అందరికి ప్రాణవాయువును అందిందామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఏస్థాయిలో ఉన్నా జన్మనిచ్చిన గ్రామాన్ని ఎవరు మర్చిపోరాదని సూచించారు. ఎక్కడ చెట్లు అధికంగా ఉంటాయో అక్కడ వర్షాలు కురుస్తాయని, పంటలు బాగా పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు లక్ష్మణ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, పట్నం వెంకటలక్ష్మి, ఆర్టీసీ కండక్టర్ మున్నూరు శ్రీనివాస్, లెక్చరర్ శివలీల, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అధ్వానంగా రోడ్లు




నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

యాలాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లు అధ్వానంగా మారాయని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. మండలంలోని లక్ష్మీనారాయణపూర్ సమీపంలో పాడైన రోడ్ల వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్-దేవనూరుకు వెళ్లే ప్రధాన రోడ్లు పూర్తిగా పాడయ్యాయని తెలిపారు. అదేవిధంగా లక్ష్మీనారాయణపూర్-బెన్నూరు మధ్య రోడ్డు మరమ్మతుల కోసం తవ్వి అసంపూర్తిగా వదిలేయడంతో ప్రయా ఈ నిరసనలో బీఆర్ఎస్ నాయకులు కొప్పుల యాదప్ప, కేవీపీఎస్ నాయకులు కరాటే చిన్న, ఫజిల్, ఎల్లప్ప, నర్సింహులు బీఆర్ఎస్ నాయకులు నాగారం పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు 'చలో ఢిల్లీ'

పరిగి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల సాధన కోసం 5,6,7 తేదీల్లో ఢిల్లీలో నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్ ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల సమయంలో బీసీల రిజర్వేషన్‌పై కామారెడ్డి డిక్లరేషన్ హామిలను సాధించుకునేందుకు ఢిల్లీలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పార్టీలకతీతంగా బీసీలంతా భారీగా తరలివచ్చి హక్కుల సాధనకు మద్దతు తెలుపాలని ఆయన కోరారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్

వికారాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని ఓంశాంతి భవనంలో మధు అక్కయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాఖీ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్న వారికి అక్కయ్యలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి జగదేవి అక్కయ్య, సీనియర్ రాజయోగ టీచర్ బీకే కళావతి అక్కయ్య, జయశ్రీ శాహాబాద్, విజయలక్ష్మి, స్థానిక ప్రముఖులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

శామీర్‌పేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అర్హులైన విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ నియామక అవకాశాలను కల్పించడానికై శామీర్‌పేట మండలం తూంకుంటలోని విశ్వవిశ్వాణి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ క్యాంపస్‌లో ఈనెల 5వ తేదీన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాను ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈజాబ్ మేళాకు విప్రో, టెలిపెర్మెన్స్, రిగాలిక్స్, టెక్ మహేంద్రా, సాగిలిటి, గెబ్స్, వర్చుసా, ఫస్ట్‌సోర్స్, ఏజీఎస్, ఎక్సెల్ సర్వీసెస్, ఐసీఐసీఐ, కాన్సెంట్రిక్స్, డిజిటైడ్, సదర్లాండ్, కియా మోటార్స్, అటోఫిన్, అలాగే ఐటీ సంబంధిత ప్రముఖ కంపెనీల రిక్రూటర్లు. ప్రతినిధులు విచ్చేసి ఉద్యోగావకాశాలను కల్పించడానికి అర్హులైన విద్యార్థులకు ఇంటర్వ్యూలను తీసుకోనున్నట్లు ఆయన వివరించారు. అన్ని నియామక కంపెనీల సంస్థలు హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. తమ కళాశాలలో నిర్వహిస్తున్న ఉద్యోగ అవకాశాల జాబ్‌మేళాకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజులు లేవని ఆయన తెలిపారు. తమ విశ్వవిశ్వాణి విద్యా సంస్థలకు, ఇతర కళాశాలకు చెందిన అర్హులైన విద్యార్థులు ఈ జాబ్‌మేళాకు విచ్చేసి కళాశాల యాజమాన్యం కల్పించిన ఉపాధి నియామక అవకాశాన్ని వినియోగించుకోవాలని డైరెక్టర్ రామకృష్ణ పిలుపునిచ్చారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



పరిగిలో స్నేహితుల దినోత్సవంలో యువత

పరిగి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవ వేడుకలు పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నంబర్ 1లో 2002, 03 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు తినిపించుకుని స్నేహితులకు చిహ్నంగా అందరూ శుభాంకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు పి.బాబయ్య, రాజశేఖర్, శ్రీనివాస్, మల్లేశ్, సందీప్ పాల్గొన్నారు.

శుభకార్యానికి ప్రముఖుల హాజరు



శారీ ఫంక్షన్‌కు హాజరైన ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్

యాలాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎరుకలి మహేశ్ కూతురు శారీ ఫంక్షన్ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్(చిన్న), గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య, ఉపాధ్యక్షుడు మోహిజ్, యూత్ కాంగ్రెస్ గౌరవాధ్యక్షుడు మారుతి, అధ్యక్షుడు అశోక్ నాయి తదితరులు పాల్గొన్నారు.